# అతిథి

ఎస్.వి. సుధాకర్ రెడ్డి

అర్ధరాత్రి కావస్తోంది. చిన్నగా చినుకులు పడుతున్నాయి. ఊరంతా చీకటి అలుముకున్నా ఆ రైల్వే స్టేషన్‌లో మాత్రం చిన్న దీపం మినుకు మినుకుమంటూ వెలుగుతోంది. ఇంతలోనే చిన్న శబ్దంతో రైలు వచ్చి ఆగింది.

మారుమూల పల్లె కావడంతో ఆ సమయంలో స్టేషన్ అంతా ఖాళీగా ఉంది. రైలులోంచి కూడా ఎవరూ దిగలేదు. చిన్నగా కూతపెట్టి రైలు వెళ్లిపోయింది. స్టేషన్ మాస్టర్ కూడా ఇక లోపలకి వెళ్లిపోదామనుకుంటూండగా చీకట్లోంచి ఎవరో రావడం కనిపించింది. వస్తున్నది ఎవరా అని స్టేషన్ మాస్టర్ చూడసాగాడు. ఇంతలోనే ఆ వ్యక్తి నడుచుకుంటూ చీకట్లోంచి వెలుగులోకి వచ్చాడు.



అయితే ఆ వ్యక్తి చాలా తమాషాగా ఉన్నాడు. నెత్తిమీద నల్ల టోపీ ఉంది. ఒంటినిండా నల్ల దుస్తులే వేసుకున్నాడు. చేతిలో కర్ర ఆసరాతో నడుస్తున్నాడు. ఇంతలోనే ఆ కుంటికాలు వ్యక్తి స్టేషన్ మాస్టర్‌ని సమీపించాడు. చిన్న వెలుతురు రేఖ వాలుగా ఆ వ్యక్తి మొహంమీద పడింది. ఆ మొహాన్ని చూసి ఎందుకో అప్రయత్నంగా స్టేషన్ మాస్టర్ ఉలిక్కిపడ్డాడు.

ఇంతలోనే ఆ వ్యక్తి అడిగాడు "ఎక్స్‌క్యూజ్ మి, మొన్న చనిపోయారే ... వాళ్లిల్లెక్కడో చెప్తారా?"

స్టేషన్ మాస్టర్ మొహంలో అనూహ్యమైన మార్పొచ్చింది. "ఇంతకీ మీ రెవరు?" అంటూ అడిగాడు.

"ఐ యామ్ దాస్! వాళ్లకి దగ్గర బంధువునే!" అన్నాడు ఆ కుంటి వ్యక్తి.

"తిన్నగా వెళ్లి, కుడివైపుకి తిరగండి!" అన్నాడు స్టేషన్ మాస్టర్.

దాసు చీకట్లోనే నడుచుకుంటూ ఊళ్లోకి బయలుదేరాడు. అలా నడుస్తున్నాడన్న మాటేగానీ, దాసుకి తననెవరో వెంటాడుతున్నట్టే అనిపించసాగింది. ఒక్కసారిగా ఆగి చుట్టూ చూశాడు. అయితే దాసుకి తెలియని విషయం ఒకటుంది. తాను నడుస్తున్నది స్మశానం పక్కనుంచేనని. ఆ స్మశానంలో సమాధుల మధ్య కొత్తగా కొద్ది రోజుల క్రితమే కట్టబడిన సమాధులలో చిన్న కదలిక ఏర్పడిందని.

***

"ఎలా ఉందక్కా, నేను రాసిన కథ!" అంది మహి.

"కథ బాగానే ఉంది గానీ, పూర్తయినట్టు లేదే! ఇంతకీ ఎప్పుడు రాశావే?" అంటూ అడిగింది సునీత.

"నిన్నే. అవును గానీ, ఇంతకీ బావగారెక్కడ కెళ్లారు?" అంటూ అడిగింది మహి.

"ఏదో పనుందని బయటకు వెళ్లారులే. నువ్వింక పడుకో! చాలా రాత్రయినట్టుంది!" అంది సునీత.

తను రాసినదాంట్లో ఏవేం మార్పులు చేయాలా అని ఆలోచిస్తూ మహి తన గదిలోకి వెళ్లిపోయింది.

హాలులో వేలాడుతున్న దేవుడి కాలండర్ మాత్రం వెనక్కి తిరిగి ఉంది.

000

మధ్యాహ్నం కావస్తుండగా మహి బయటకు వచ్చింది. రైల్వే స్టేషన్‌కి సమీపంలో ఎవరో పిలుస్తున్నట్టయి మహి ఆగిపోయింది. వెనక్కి తిరిగి చూసింది. ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఎవరో వ్యక్తి కర్రసాయంతో నడుచుకుంటూ వస్తున్నాడు. ఆ వ్యక్తి నెత్తిమీద టోపీ పెట్టుకుని, ఒంటినిండా నల్ల దుస్తులు ధరించి ఉన్నాడు. ఇంతలో ఆ వ్యక్తి మహి దగ్గరకు వచ్చాడు.

మహి ప్రశ్నార్థకంగా చూసింది. ఆ వ్యక్తిని చూస్తుంటే అచ్చు తన కథలో పాత్రలాగానే ఉన్నాడు. "ఏమ్మా మహీ మా! నేనమ్మా, దాసుని. నీకు బాబాయి వరసనవుతాను. జరిగిన ఘోరం తెలిసి వచ్చానమ్మా! అనుకోకుండా నువ్వే కనిపించావు!" అన్నాడు.

మహికి ఏమీ అర్థం కాలేదు. "మీరేం అంటున్నారో నాకేమీ అర్థం కావడంలేదు!" అంది.

"అవునూ, నువ్వెక్కడో చదువుకుంటున్నావట కదా! ఇంతకీ ఎప్పుడొచ్చావమ్మా?" అంటూ అడిగాడు.

మహి కొంచెం కన్‌ఫ్యూజ్ అయి, "నేను నిన్నే మా అక్కా వాళ్లింటికి వచ్చాను!" అంది.

దాసు మొహంలో విస్మయం కనిపించింది. "విషయం తెలిసి చాలా బాధపడ్డానమ్మా! నువ్వెలా తట్టుకున్నావో ననిపిస్తోంది!" అన్నాడు.

మహికి ఇంకా గందరగోళంగానే ఉంది.


"మీరేమంటున్నారో నాకేం అర్థం కావడంలేదు!" అంది.

దాసు అప్పుడు చెప్పాడు "అదేంటమ్మా అలా అంటావ్? మీ అక్క సునీత, బావ జయరామ్‌లు ఇద్దరూ హఠాత్తుగా చనిపోవడం గురించి...!" అన్నాడు.

మహి ఒక్కసారిగా ఉలిక్కిపడింది. "మీరు చెపుతున్నదేమిటో నాకు అర్థం కావడంలేదు. అసలు మీరు ఎవరిని గురించి మాట్లాడుతున్నారో కూడా నాకు అర్థం కావడంలేదు. ఆఖరికి నిన్న రాత్రి కూడా మా అక్కతో మాట్లాడాను!" అంది మహి ఎంతో నమ్మకంగా. మళ్లీ "సరే, మీరు అంతలా చెపుతున్నారు కాబట్టి మనం తిన్నగా ఇంటికే వెళ్లి మా అక్కతోనే మాట్లాడదాం!" అంది.

దాసు సరేనంటూ తలూపాడు. ఇద్దరూ సునీత ఇంటివైపు బయలుదేరారు. వాళ్లు వెళ్లేసరికి ఇంటికి తాళం వేసి ఉంది. ఇంటి ముందుండే తులసి మొక్క లేదు. ఎవరో పెకలించి పట్టుకుపోయినట్టున్నారు. కిటికీ తలుపులు దగ్గరగా వేసి ఉన్నాయి.

ఇంతలో దాసు కిటికీ దగ్గరగా వెళ్లి తలుపులు తోశాడు. కిటికీలోంచి హాలంతా కనిపిస్తోంది. లోపల హాలులో సునీత, జయరామ్‌ల ఫొటోలు గోడమీద వేలాడుతున్నాయి. ఆ రెండు ఫొటోలకి దండలు వేసి ఉన్నాయి. ఇల్లంతా ఎవరూ ఉపయోగించనట్టు దుమ్మూ, ధూళితో నిండి ఉంది.



దాసు వెనుకగా వచ్చి కిటికీలోంచి లోపలికి తొంగి చూసిన మహి లోపల తన అక్క, బావల ఫొటోలకు వేసి ఉన్న దండలు చూసి భయంకరంగా అరిచింది.

## శవాలే ఆహారంగా స్మశానాల్లో నివసించే వింతమనుషులు

శవాలను చూస్తేనే ఒక్క క్షణం ఒళ్లు జలదరించే మనకు నిర్జీవమైన మానవదేహాన్నే పంచభక్ష్య పరమాన్నంగా భావించి తినే మనుషులుంటారంటే అంతకన్నా పెద్దవిచిత్రమేం ఉంటుంది. అదీ పవిత్రతకు మారు పేరుగా పరిగణించబడే మన భారతదేశంలోనే అలాంటి వ్యక్తులు ఉన్నారంటే నమ్మశక్యం కావడం లేదుకదూ?! అయినా, ఇది పచ్చినిజం.

హిమాలయపర్వత పరిసరాలలోని పుణ్యక్షేత్రాలలో, అరణ్యాలలో అక్కడక్కడా దర్శనమిచ్చే అఘోరీలు అనబడే శివభక్తుల నివాసం...స్మశానం. చచ్చిన శవాలను కాల్చగా మిగిలిపోయిన కట్టెలను మండించి వీరు శివుడ్ని ఆరాధిస్తారు. మొలకు చినిగిపోయిన బెత్తెడు గుడ్డముక్కతప్ప మరేమీ ధరించని ఈ అఘోరీలు కాలీకాలని శవాలను ఆబగా ఆరగించేస్తారు. సంవత్సరాల తరబడి తైలసంస్కారంలేక జడలు కట్టిన తలతోసహా, శరీరమంతా వల్లకాడులో దహనానంతరం లభించే బూడిదను వీరు పూసుకుంటారు.



అసలు వంట అంటేనే వీరికి ఇప్పటికీ ఒంటబట్టలేదు. జంతువులు, మనుషుల కళేబరాలు కనిపిస్తే మృగాల్లా ఎగబడి వాటిలోని మాంసాన్ని ఎంచక్కా భుజిస్తారు. మంచినీరు తాగాలన్నా, భోజనం చేయాలన్నా వారు ఉపయోగించే పాత్ర...పురుషుని పుర్రె. అన్నింటికంటే వీరికున్న అసహ్యా ఘోరమైన అలవాట్లు...దప్పికైతే తమ మూత్రాన్ని తామే తాగడం; ఆకలైతే ఎవరి మలాన్ని వారే భుజించేయడం. పగలంతా స్మశానంలో ఏ మూలనో నిద్రపోయే వీరి ప్రార్థనా కార్యక్రమం సాధారణంగా అర్థరాత్రి దాటాకనే ప్రారంభం అవుతుంది. 'ఓం శంభో' అన్న మంత్రోచ్చారణతో వీరి పూజా కార్యక్రమం మొదలవుతుంది.

వీరికి ఎన్నో తాంత్రిక, మాంత్రిక, క్షుద్రశక్తులు ఉన్నా విశ్వమానవాళికి హానిచేసే విధంగా ఆ శక్తులను వారెప్పుడూ ఉపయోగించలే దన్నది సుస్పష్టం. మరో విశేషమేమంటే, సాధారణ జనజీవనానికి ఎంతోదూరంగా నివసించే వీరు భిక్షాటన చేయాల్సివచ్చినా హీనకులాలు, వేశ్యలు, పారిశుద్ధ్యవృత్తితో జీవించేవారి దగ్గరకే వెళతారు. నాగరికత ముసుగులో మిడిసిపడేవారి ఛాయలకు వెళ్లడానికి వారు సుతరామూ ఇష్టపడరు. వారి వ్యక్తిత్వంలో మనల్ని ఆకట్టుకునే మరో అంశం మౌనంగా ఉండడం. మనమేం మాట్లాడినా, లోకమంతా మిథ్య అన్నట్లు ప్రవర్తిస్తారు. పాదాలకు నమస్కరించినా, తాము నిమిత్తమాత్రులం అన్నట్లు తొలగిపోతారేతప్ప కనీసం దీవెనలైనా అందించరు.

సాధారణ జీవితంపై విసిగివేసారి, ప్రాపంచికసుఖాలపై విరక్తి పుట్టి జీవితాన్ని పరమేశ్వర సాక్షాత్కారంకోసం అంకితం చేయాలన్న జిజ్ఞాస, ధ్యాస కలవారు ఎవరైనా ఈ అఘోరీల గురువును కలిస్తే...అతనికి ఇతనిపై నమ్మకం కుదిరితే, ముందుగా ఆ శిష్యుడు స్మశానానికి వెళ్లి ఓ పురుషుని కపాలం పట్టుకురావడంతో అఘోరీగా అతని జీవితానికి నాంది ఏర్పడుతుంది. అలా కొంతకాలం జరిగిన తరువాత గురువు శిష్యునికి మంత్రోపదేశం చేస్తాడు. అఘోరీలు పాటించవలసిన ఆచారవ్యవహారాలన్నీ పూసగుచ్చినట్లు శిష్యునికి వివరిస్తాడు. శివుని ఎలా పూజించాలో వివరిస్తాడు. మంత్రోపదేశం జరిగిన తరువాత 41 రోజులపాటు అన్నపానాదులు లేకుండా, పరిపూర్ణ మౌనవ్రతంతో తపస్సు ఆచరించాలి. ఆపైన ఆత్మసాక్షాత్కారంకోసం గురువు చెప్పిన రీతిలో స్మశానంలో ఒంటికాలిపై మరికొన్నిరోజులపాటు తప మాచరించి, ఆ తరువాత ఆయనవద్ద తాంత్రిక, మాంత్రిక రహస్యాల నెన్నింటినో ఔపోసన పడతారు.

పురాణేతిహాసాలను, వేదవేదాంగాలను, ఉపనిషత్తులను వడపోసి చూసినా, అఘోరీలు అవలంభించే వికృతమైన ఆచారవ్యవహారాలు మనకు మచ్చుకైనా కన్పించవు. అసలు వీరి జీవనవిధానం ఎక్కడ, ఎవరిద్వారా ఆరంభమైందోకూడా పరిశోధకులకు సైతం అంతుపట్టడం లేదు. భగవంతుని సాన్నిధ్యాన్ని చేరేందుకు ఎన్నోరకాల పవిత్రమైన భక్తిమార్గాలద్వారా ప్రయత్నిస్తున్న నేటి భక్తజనానికి అఘోరీల వికృతమైన చేష్టలు ఒకపట్టాన మింగుడుపడ వన్నది ఎవరూ కాదనలేని సత్యం. మరి వారి ముక్తిమార్గంలో దాగున్న వాస్తవమేమిటో?

నల్లమోతు శ్రీధర్

ఇంతలో దాసు, "ఇంక ఎంతమాత్రం నువ్వీ ఇంట్లో ఉండటానికి వీల్లేదమ్మా! నాతో మా ఊరొచ్చేయ్! నువ్వు సామాన్లు అవీ సర్దుకుని ఉండు. నేను చిన్న పని చూసుకుని వచ్చేస్తాను!" అంటూ చెప్పి దాసు బయటకు నడిచాడు.

దాసు నడుస్తున్నాడన్న మాటే గానీ, ఒకటే ఆలోచిస్తున్నాడు ఇంతకీ మహిమ మాట్లాడింది ఎవరితో? అన్నది ఎంతకీ అర్థం కావడంలేదు. దాసు. ఆలోచనలతోనే నడుచుకుంటూ స్మశానం పక్కకి వచ్చేశాడు. నడుస్తూనే అప్రయత్నంగా తల పైకెత్తి చూశాడు. ఎదురుగా స్మశానం లోపల కొత్తగా కట్టిన మూడు సమాధులు కనపడుతున్నాయి. దాసు ఆ సమాధులమీద పేర్లు చదవసాగాడు

మొదటి సమాధిమీద జయరామ్ అనీ, రెండో సమాధిమీద సునీత అనీ ఉంది. రెండు సమాధులమీదా మరణపు తేదీ 10.9.79 అని ఉంది. మూడో సమాధి ఆ రెండు సమాధులకూ కొద్దిగా దూరంగా ఉంది. దాని మీద మరణ తేదీ 13.9.79 అని ఉంది. అంటే మూడు రోజులు తేడా ఉంది. ఆ మూడో సమాధి మీద పేరేమిటా అని దాసు ఆత్రుతగా చదివాడు.

అది చదివిన దాసు గుండె జల్లుమంది. ఆ సమాధిమీద పేరు మహిమ అని ఉంది. అయితే ఇందాక తను మాట్లాడింది ఎవరితోనా అని ఆలోచించసాగాడు. ఆలోచించేకొద్దీ దాసు కాళ్లు వణకసాగాయి.

ఇంతలోనే స్టేషన్ మాస్టర్ అటుగా రావడం కనిపించింది. దాసు అయోమయంగా సమాధుల వంక చూడటం చూసి స్టేషన్ మాస్టరే అడిగాడు "ఏమిటీ, ఇక్కడ నిలబడి ఆ సమాధులవంక అంత దీక్షగా చూస్తున్నారు? పాపం, ఆ జయరామ్, సునీత అకస్మాత్తుగా ప్రమాదంలో చనిపోయారు. అది తెలిసి సునీత చెల్లెలు మహిమ పట్నం నుంచి పరుగెత్తుకొచ్చింది. ఆ రోజంతా ఏడుస్తూనే ఉంది. ఆ రాత్రి ఒంటరిగా ఎవరు చెప్పినా వినకుండా మహిమ తన అక్క, బావ చనిపోయిన ఇంట్లోనే పడుకుంది. పాపం, ఏదో ఒంటరిదని నేనూ ఓ రోజు ఆమె అతిథిగా వెళ్లాను. ఆ తరువాత రెండు రోజులపాటు ఎవరికీ ఆమె కనపడలేదు. మూడో రోజు చచ్చిపోయి కనిపిస్తే ఇదిగో, ఇక్కడే సమాధి కట్టించారు!" అంటూ స్టేషన్ మాస్టర్ వివరించాడు.

అప్పటికే దాసు మొహంలో చావు భయం వచ్చేసింది. ఇంకోసారి భయంగా మహి సమాధివంక చూశాడు.

అప్పటికి స్టేషన్ మాస్టర్ కూడా పరిస్థితి అర్థం చేసుకున్నట్టున్నాడు "ఇప్పుడు మీ రేదో ఊరు బయలుదేరబోతున్నట్టున్నారు. రేప్పొద్దున్న దాకా రైలు కూడా ఏమీ లేదు. మీకు అభ్యంతరం లేకపోతే నాకు అతిథిగా ఈ రాత్రి ఉండి పొద్దున్న వెళ్లవచ్చు!" అన్నాడు.

అప్పటికే డీప్ షాక్‌లో ఉన్న దాసు సరేనంటూ స్టేషన్ మాస్టర్‌ని అనుసరించాడు. అయితే దాసుగానీ తలతిప్పి స్మశానంలో ఓ మూలగా కొత్తగా కట్టబడిన సమాధిని చూసుంటే ఎట్టి పరిస్థితులలోనూ స్టేషన్ మాస్టర్ వెంట వెళ్లి ఉండేవాడు కాదు. కొత్తగా కట్టబడిన ఆ సమాధిమీద సామ్యేల్ అని ఉంది. సామ్యేల్ అన్నది స్టేషన్ మాస్టర్ పేరు. ■